యోగాతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం



ఆల్విన్‌కాలనీ: యోగాతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని యోగా గురువు నరేంద్ర బంధూజీ అన్నారు. ఆల్విన్ కాలనీ చివరి బస్‌స్టాప్‌లోని ఎంఎల్‌ఎస్ గార్డెన్స్‌లో నిర్మల సాధన జ్యోతి మందిర్ యోగా సెంటర్ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అడ్వాన్స్ యోగాసనాలు వేసి అబ్బుర పరిచారు. కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చంద్రశేఖర్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'భవిష్యనిధి అదాలత్'

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28న భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వి.వి. డాంగ్లికర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గాంధీనగర్‌లోని నందా ఫుడ్స్ కంపెనీ కార్యాలయం, జీఎల్ గ్రూప్ కంపెనీ, కేఎల్‌ఆర్ విజయ్‌నగర్ మేడ్చల్‌లో ఉంటుందని ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 ప్రశాంతంగా ముగిసినట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. పీహెచ్‌డీ కేటగిరీ–2లో ప్రవేశాలకు ఈ నెల 25, 26, 27 తేదీలలో జరిగిన పరీక్షలకు 9747 మంది దరఖాస్తు చేసుకోగా 7903 మంది అభ్యర్థులు (81.08శాతం) హాజరైనట్లు తెలిపారు. మే 1న ప్రథమిక కీని, చివరి వారంలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న రమేశ్, వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: భాగ్యనగర్ కాలనీలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ ఆయనతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 17 మందికి సుమారు రూ. 7. 20 లక్షల ఆర్థిక సాయం మంజూరైందన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేశ్, గోవింద్ గౌడ్, ఆర్. వాసు, మల్లేశ్ యాదవ్, రాజు యాదవ్, రమణ, నరేందర్, బండి సుధ, జ్యోతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతరాజు వెంకటేశ్వర్లుకు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చరిత్ర విభాగం విద్యార్థి పోతరాజు వెంకటేశ్వర్లకు చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. చరిత్ర విభాగం అధ్యాపకులు డా.రమేష్ పర్యవేక్షణలో తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర అనే అంశంలో పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వెంకటేశ్వర్లు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు.

9వ రోజుకు అధ్యాపకుల సమ్మె

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతోంది. ఆదివారానికి కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు 9 రోజులు కాగా, ఐదు రోజులుగా పార్ట్‌టైం అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. అయినా ప్రభుత్వంగాని , యూనివర్సిటీల అధికారులుగాని పట్టించుకోకవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆయా వర్సిటీల పాలన భవనాల ఎదుట సుమారు 2000 మంది అధ్యాపకులు సమ్మెలో పాల్గొనడంతో డిగ్రీ పరీక్షల పై తీవ్ర ప్రభావం పడింది.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మోతీనగర్: అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. అల్లాపూర్ సీఐ సాముల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖాదర్ (40) మేరాజ్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. 6 నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నాడు. ఈనెల 26న ఖాదర్ ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన భార్య, కుటుంబ సభ్యులు వెంటనే ఖాదర్‌ను ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఖాదర్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ

సభకు తరలిన శ్రేణులు

● వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో అట్టహాసంగా నిర్వహణ ● పార్టీ జెండాలు ఆవిష్కరించిన నాయకులు

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల నుంచి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ జెండాలను ఎగరేశారు. అనంతరం బస్సులు, వాహనాలు, కార్లలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. 25 ఏళ్ల బీఆర్ఎస్ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అవమానాలు పడి, కష్టాలకు ఎదురొడ్డి నిలిచి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. అంతేగాకుండా ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న విధానాలతో అన్ని రంగాలు కుంటు పడ్డాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించారని తిరిగి మళ్లీ కేసీఆర్‌కే పట్టం కడుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



ఎమ్మెల్యే కృష్ణారావు ఇంటి నుంచి సభకు వెళ్తున్న శ్రేణులు



అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ర్యాలీగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు



కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు



వివేకానందనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, శ్రేణులు



కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

మెగా హెల్త్ క్యాంప్‌కు స్పందన





శిబిరాన్ని ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి మెయిన్‌రోడ్డులో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది, ఆశా వర్కర్ల కోసం ఆదివారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమారు 2400 మంది వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు శిబిరానికి హాజరై పలు విభాగాలను ప్రారంభించి మాట్లాడారు. రాందేవ్‌రావ్ ఆసుపత్రి కూకట్‌పల్లి ప్రాంతంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విక్రందేవ్‌రావ్, మీరారావ్, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావు, సీఇఓ డాక్టర్ ఎన్. యోబు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 సొసైటీ ప్రాంగణంలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 సొసైటీ ప్రాంగణంలో కాలనీ అధ్యక్షుడు ఎం. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భాస్కర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మన కల్చర్ సెక్రటరీ కొండా రెడ్డి, కమిటీ మెంబర్ డి. శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్, తదితరులు

ఆల్విన్‌కాలనీ / మూసాపేట / మోతీనగర్/ ఓల్డ్ బోయిన్‌పల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం పలుచోట్ల నిరసనలు కొనసాగాయి. అలాగే మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులు వెలగించి ర్యాలీలు తీసి, మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాధారణ పౌరులపై ఉగ్రవాదులు దాడులు చేయడం అమానుషమని అలాంటి వారిని కుకుటివెళ్లతో పెకిలించాలని డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడమే కాకుండా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ప్రభుత్వాలను కోరారు. ఆయా చోట్ల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

జవహర్ బాల్‌మంచ్ రాష్ట్రస్థాయి సదస్సు

గచ్చిబౌలి: జవహర్ బాల్‌మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్‌రెడ్డి అధ్యక్షతన జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణా సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. జవహర్ బాల్‌మంచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్ కన్వీనర్ జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ సమక్షంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సదస్సును జవహర్ బాల్‌మంచ్ జాతీయ అధ్యక్షుడు జీవి హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మంచ్ జాతీయ ప్రతినిధి, రాష్ట్ర ఇన్‌చార్జీ ఫెన్ రస్సెల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో మొట్టమొదటి జవహర్‌బాల్ మంచ్ ఎన్నికలు నిర్వహించి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షులు పునీత్, అంబటి సుచరితను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు, ఆశయాలు, స్ఫూర్తిని, పంచాయతీ రాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు రిషికేష్‌రెడ్డి మాట్లాడుతూ జవహర్ మంచ్‌బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్త పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాల నుంచి తితిలి యూనిట్‌లోని పిల్లలు 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్‌బాబు, కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయికృష్ణ, బాల్యానాయక్, సైదేశ్వరరావు, సుదర్శన్, సునీల్, విదుర్‌చావ్లా, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' వీక్షణ



ప్రధాని సందేశం వింటున్న రాజేశ్వరరావు, నాయకులు

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతినెల చివరి ఆదివారం జాతిని ఉద్దేశిస్తూ 'మన్ కీ బాత్' ద్వారా తన అభిప్రాయాలు వ్యక్త పరుస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో కూకట్‌పల్లి డివిజన్ బూత్ నంబర్ 13లో బూత్ అధ్యక్షుడు కట్ట శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ బలమైన సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, అర్యనపల్లి సూర్యారావు, సీనియర్ నాయకులు జి. పాపారావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, కృష్ణ ప్రియ, ఫణీంద్ర శర్మ, సంతోష్ గుప్తా, మంజునాథ్, విశాల్ సాగర్, శేఖర్, రమణారెడ్డి, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ కృషి



సాక్షి, సిటీబ్యూరో: విద్యారంగ అభివృద్ధికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. ఉపాధ్యాయ నాయకులు నిరంతరం అధ్యయనం చేస్తూ..ఉపాధ్యాయ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శని, ఆది వారాల్లో నగరంలో టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా శాఖ నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యమ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. మొదటి రోజు ×ఉపాధ్యాయ ఉద్యమం×అనే అంశంపై ఉపాధ్యాయ రాష్ట్ర నేత పాపన్నగారి మాణిక్ రెడ్డి బోధించారు. ఈ సందర్భంగా సంఘం పని విధానం, ఉపాధ్యాయ సమస్యల సాధనకు సంబంధించిన ఉద్యమం పని తీరును మాణిక్‌రెడ్డి వివరించారు. రెండవ క్లాస్‌లో 'విద్యారంగం–శాస్త్రీయ ఆలోచనలు'అనే అంశంపై సంఘం రాష్ట్ర కార్యదర్శి జ్ఞాన మంజరీ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగయ్య, జిల్లా అధ్యక్షులు ఓ జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్, వందన, జిల్లా కోశాధికారి గౌడుగు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, కుమారస్వామి, సుందరయ్య, సుధాకర్, అనంతయ్య, ఆడిట్ కన్వీనర్ గౌరయ్య, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల్లో చేరేదెలా..?

తెలియక దూరంగా ఉంటున్న మహిళలు

- ప్రభుత్వం అందించే వివిధ రకాల రాయితీ రుణాలు పొందలేని స్థితి
- ఆధార్ చిరునామా..10 మంది మహిళలుంటే సంఘమే..
- దివ్యాంగులైతే..ఐదుగురు సభ్యులు చాలు
- మేడ్చల్ జిల్లాలో 10,575 మహిళా సంఘాలు.. 1.10లక్షల మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: చాలా మంది మహిళలకు సంఘంలో చేరే విధానం తెలవదు. ఇప్పటి వరకు మహిళలు సంఘంలో చేరనివారున్నారు. మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేరి ప్రభుత్వం అందించే వివిధ రాయితీ రుణాలు పొందడం తెలియక దూరంగా ఉంటున్నారు. తద్వారా స్వశక్తితో ఆర్థికంగా ఎదగడానికి అవకాశమున్న వెనకబడిపోతున్నారు. ఇప్పటికే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 10,575 సంఘాలు ఉండగా 1,10,007 మంది సభ్యులున్నారు. ఇప్పటివరకు ఎక్కడా సభ్యత్వం లేని మహిళలు కొత్త సభ్యులుగా చేరడానికి అవకాశముంటోంది. ఇందుకోసం ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటోంది.

నిబంధనలు ఇలా..

మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలంటే సదరు మహిళకు ఆధార్ కార్డు ఉండాలి. ఆధార్ చిరునామా ఎక్కడ ఉంటే అదే గ్రామం, పట్టణంలో మాత్రమే సభ్యత్వం ఇస్తారు. గతంలో ఏదైనా సభ్యత్వం ఉండి డీఫాల్టర్‌గా ఉంటే కొత్త సంఘాల్లో సభ్యత్వం లభిస్తోంది. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు పొదుపు సంఘాల్లో సభ్యత్వం పొందడానికి అవకాశముంది. ఇప్పటికీ ఏ పొదుపు సంఘంలో సభ్యత్వం లేకుంటే కొత్తగా 10 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. దివ్యాంగులైతే కేవలం ఐదుగురు సభ్యులతో సంఘం ఏర్పాటు చేసుకునే అవకాశముంటోంది. గ్రూపు సభ్యులందరూ కలిసి గ్రూపు పేరిట సంయుక్త ఖాతాను తీసుకోవాల్సి ఉంటోంది. సంఘం సభ్యులందరూ కలిసి గ్రూపునకు ఎన్నికలు నిర్వహించుకుని, అధ్యక్ష, కార్యదర్శులు కమిటీని ఎన్నుకోవాల్సి ఉంటోంది. ఆతర్వాత తీర్మానం అమలు చేసుకొని సంఘానికి ఒక పేరు నిర్ణయించుకోవాల్సి ఉంటోంది. తీర్మానం ప్రతిని ఆయా బ్యాంకు మేనేజర్‌కు, ఐకేపీ సీసీకి అందజేయాల్సి ఉంటోంది. పట్టణాల్లో (పురపాలికల్లో) అయితే మెప్మా సిబ్బందిని కలిసి తీర్మానం ప్రతిని ఇవ్వాల్సి ఉంటోంది. సంఘం తీర్మానం ప్రకారం మొదటి, రెండో నాయకురాళ్ల పేరిట బ్యాంకు లావాదేవీలు కొనసాగుతాయి. కొత్తగా సంఘం ఏర్పాటైన మహిళలకు వ్యక్తిగతంగా గ్రూపునకు కలిపి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణం అందనుంది. ఈ రుణాలను సకాలంలో చెల్లిస్తే ఆరు నెలల తర్వాత ఇంకా ఎక్కువ మొత్తంలో రుణాలు అందజేస్తారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు..!

600 చదరపు అడుగుల విస్తీర్ణం దాటితే..అంతే

- తొలి విడతలో ఎంపికైన వాటిలో బేస్‌మెంట్ పూర్తయింది 28 ఇళ్లకే..
- రెండో విడతలో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- వచ్చే నెల 5 వరకు లబ్ధిదారుల తుది జాబితా



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతంగా చేపట్టేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు కాగా, సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మే 5 నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జనవరి 26న మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడతలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 752 ఇళ్లు మంజూరు కాగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు యుద్ధప్రాతిపదికన అధికార యంత్రాంగం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కసరత్తు చేస్తోంది. పేదల్లో అతి పేదలకు ముందుగా ప్రాధాన్యం ఇచ్చి ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా ఎంపికైన లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా అవసరమైన సాయం అందించేందుకు మండలానికి ఒక బృందాన్ని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తొలి విడతలో 28 ఇళ్లకు పూర్తయిన పునాది..

తొలివిడతలో ఎంపిక చేసిన వాటిలో 28 ఇళ్లకు బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయ్యింది. ఒక దశ విజయవంతంగా ముగియడంతో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారించి నిర్మాణ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లబ్ధిదారులే పునాది వరకు నిర్మించాక అధికారులు బిల్లింగ్ చేస్తే మంజూరైన మొత్తంలో ప్రభుత్వం తొలివిడతగా రూ.లక్షను వారి ఖాతాల్లో జమచేస్తోంది. పేదలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం, బేస్‌మెంట్ వారే నిర్మించుకోవాలని నిబంధన పెట్టడంతో పలువురు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు..

రెండో విడత ఇళ్ల మంజూరుకు కసరత్తు ప్రారంభమైంది. ఇళ్ల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాలు, పురపాలక సంఘాల వారీగా స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయగా, వారు పరిశీలించి, ఆ జాబితాను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేశారు. ఈ కమిటీలు కూడా జాబితాపై మరోసారి విచారణ నిర్వహించి, ఎంపీడీవోలు, పురపాలక అధికారులు అప్పగించగా, వారు ఈ నెల 30 వరకు మరో సారి విచారణ చేపట్టనున్నారు. మే 5 వరకు తుది జాబితాను పోర్టల్‌లో మరోసారి విచారించి.. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదిస్తారు.

విస్తీర్ణం దాటితే...అనర్హతే..

నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించకుంటే అనర్హులుగా గుర్తిస్తారు. సొంత ఇంటి స్థలం ఉన్న పేదలు 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో తమకు ఇష్టమొచ్చినట్లు ఇల్లు నిర్మించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. లబ్ధిదారులకు పలు విడతల్లో రూ.5 లక్షల సాయం అందజేయనుంది. తొలిదశలో పునాది పూర్తయిన ఇంటి నిర్మాణాలకు మొదటి విడతగా రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేస్తారు. గృహ నిర్మాణశాఖ పునాది పూర్తయిన ఇళ్ల కొలతలు చేస్తుండటంతో..కొంతమంది లబ్ధిదారులు ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. వీరికి మొదటి విడతగా చెల్లించే రూ.లక్ష నిలిపివేశారు. 600 చదరపు అడుగుల స్థలం మించి నిర్మాణం చేపట్టిన వారు పేదలు కాదని, వారికి ఇందిరమ్మ పథకం వర్తించదని గృహనిర్మాణ శాఖ చెబుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.